క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య శిబిరం

సంతబొమ్మాళి: జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంతబొమ్మాళిలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఆప్తాలిమిక్ ఆఫీసర్ టి.శివప్రసాద్ 68 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 35 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వీరికి శంకర్ ఫౌండేషన కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయనున్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర ఆర్టికల్స్ ప్రొపరైటర్, క్యాంప్‌కో ఆర్డినేటర్ అల్లు కోమలి, అల్లు రమేష్ ఉన్నారు.

కందిపప్పు విక్రయ కేంద్రం ప్రారంభం


కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నూరుల్ కమర్

టెక్కలి: ప్రభుత్వం నిర్దేశించిన ధర ప్రకారం గుర్తించిన విక్రయ కేంద్రంలో కిలో కంది పప్పు 160 రూపాయలకే అమ్మకాలు చేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. టెక్కలి సంతోషిమాత ఆలయానికి ఎదురుగా పౌర సరఫరాల శాఖ గుర్తించిన దుకాణంలో కందిపప్పు విక్రయ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు బాలమురళి, సీఎస్‌డీటీ మురళి, స్థానిక నాయకులు బి.శేషగిరి, కె.లవకుమార్, ఎల్.శ్రీనివాస్, కె.కామేష్ పాల్గొన్నారు.

లయన్స్ సేవలు విస్తృతం చేస్తాం

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు లయన్స్ సేవలను మరింత విస్తృతం చేస్తామని పలాస–కాశీబుగ్గ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హనుమంతు యెండుదొర అన్నారు. బెండి ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ తరఫున స్థానిక ప్రధానోపాధ్యాయుడు బి.బాబూరావు ఆధ్వర్యంలో రూ. ఏడు వేలు విలువ చేసే గ్లాస్‌తో కూడిన గోద్రెజ్ టేబుల్, ప్లాస్టిక్ కుర్చీలను బుధవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలపురి అప్పారావు, సభ్యులు కింతలి రామన్న, వి.వెంకటరావు, ఉపాధ్యాయులు కె.శోభన్‌బాబు, వి.గిరి, పి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆస్పత్రికి రూ. 25 వేల విలువైన పరికరాలు అందజేత


పరికరాలు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

సోంపేట: సోంపేట సామాజిక ఆస్పత్రికి రూ. 25 వేలు విలువైన పరికరాలను సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు జుత్తు చలపతిరావు, ప్రతినిధులు బుధవారం అందజేశారు. ఆస్పత్రి అవసరాల దృష్ట్యా వీటిని అందించామని రోటరీ ప్రతినిధులు తెలిపారు. రోటరీ ప్రతినిధులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ తుంగాన వెంకటేష్, వైద్యసిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి శివాజీ ఈపరి, పూర్వ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, డాక్టర్ ఇ.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జగన్నాథ రథోత్సవాలు

• వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న స్వామివారు


ఇచ్ఛాపురం: శ్రీరామలక్ష్మణులుగా దర్శనమిచ్చిన జగన్నాథస్వామి వారు

ఇచ్ఛాపురం: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇందులో భాగంగా ఇచ్ఛాపురంలోని జగన్నాథస్వామి ఆలయం వద్ద గుడించా మందిరంలో సుభద్ర, బలరామస్వామిలతో పాటు కొలువైన జగన్నాథస్వామి వారు శ్రీరామలక్ష్మణుల అవతారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

టెక్కలిలో వరహావతారంలో..


టెక్కలి: వరహావతారంలో స్వామివారు

టెక్కలి: టెక్కలిలో జగన్నాథ స్వామివారు వరహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పాత జాతీయ రహదారిలోని గుండిచాదేవి ఆలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కానరాని డయేరియా వార్డు!

• మహిళల వార్డుల్లో పురుషులు
• పట్టించుకోని వైద్య సిబ్బంది


డయేరియా రోగులతో ఉన్న సాధారణ రోగులు


మహిళలకు కేటాయించిన వార్డులో మగవాళ్లు

టెక్కలి రూరల్: కొద్దిరోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో ఒక్కసారిగా సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. ప్రధానంగా డయేరియా కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నాయి. టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోజూ పదుల సంఖ్యలో డయేరియా కేసులు నమోదు అవుతున్నాయి. వాటిలో కొన్ని కేసులను ఆస్పత్రిలో చేర్చుకొని సాధారణ వార్డులోనే చికిత్సను వైద్యులు అందిస్తున్నారు. అయితే డయేరియా రోగుల కోసం ఆస్పత్రిలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయలేదు. వీరికి జనరల్ వార్డులోనే ఉంచుతున్నారు. దీంతో డయేరియా రోగులతోపాటు మిగిలిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పక్క పడకలోనే డయేరియా రోగి ఉంటే.. ఆ లక్షణాలు తమకు ఎక్కడ వ్యాపిస్తాయోనని భయపడుతున్నారు. అలాగే మహిళ రోగులకు ప్రత్యేకంగా కేటాయించిన వార్డుల్లో సైతం మగవాళ్లను ఉంచుతున్నారు. దీంతో మహిళా రోగులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. డయేరియా రోగులపై ప్రత్యేక దృష్టిసారించి మెరుగైన వైద్యాన్ని అందివ్వాలని అధికారులు చెబుతున్నప్పటికీ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో మాత్రం దానికి భిన్నంగా ఉంది. ఇప్పటికైన వైద్యాధికారులు మేల్కొని డయేరియా రోగుల కోసం ప్రత్యేక వార్డులను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

సరిపడా గదుల్లేవు

డయేరియా రోగుల కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే సరిపడా గదుల్లేవు. దీంతో ఉన్న వార్డుల్లోనే మిగిలిన రోగులతో కలిపి ఉంచే పరిస్థితి నెలకుంది.. మహిళల వార్డుల్లో మగవాళ్లను ఉంచడంపై చర్యలు తీసుకుంటాం.

– బొడ్డేపల్లి సూర్యారావు,
సూపరింటెండెంట్, టెక్కలి జిల్లా ఆస్పత్రి

హెల్మెట్ వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న జడ్జి తేజచక్రవర్తి మల్ల


ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న జడ్జి పరేష్‌కుమార్

టెక్కలి: ప్రతీ ద్విచక్ర వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజచక్రవర్తి మల్ల అన్నారు. హెల్మెట్ వాడకంపై బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో కక్షిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించడం వలన ప్రమాదాల నుంచి సురక్షితంగా ప్రాణాలతో బయట పడవచ్చునని పేర్కొన్నారు. హెల్మెట్ ధారణపై గ్రామ స్థాయిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జడ్జి సూచించారు.

హెల్మెట్ విధిగా వాడాలి

ఇచ్ఛాపురం: ద్విచక్ర వాహనాలను నడిపే ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్‌ను ధరించాలని స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి పి.పరేష్‌కుమార్ సూచించారు. ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ జడ్జికోర్టు ఆవరణ, శాంతినికేతన్ పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. మోటార్ వెహికల్ చట్టం, హెల్మెట్ పెట్టుకోవడం ద్వారా చేకూరే ప్రయోజనాల గురించి వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి, న్యాయవాదులు రంగారావు, సీతయ్యరెడ్డి, నాగరాజుపాత్రో, మనోజ్‌కుమార్, హేమలత, సూర్యనారాయణ, ఎస్ఎల్ఎన్ బైరాగి, సత్యన్నారాయణ, జగ్గారావు, భగవాన్‌దాస్, పాఠశాల చైర్మన్ దక్కత కృష్ణమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కేల ద్వారా పశుగ్రాస విత్తనాలు సరఫరా


చౌదరికొత్తూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోటబొమ్మాళి: మండలంలోని 27 రైతుసేవా కేంద్రాల ద్వారా పశుగ్రాస విత్తనాలను సబ్సిడీపై పాడి రైతులకు అందజేస్తున్నట్లు కోటబొమ్మాళి వెటర్నరీ ఏడీ మంద లోకనాథం తెలిపారు. పశుగ్రాస ఉత్సవాల్లో భాగంగా చౌదరికొత్తూరు, పొన్నాడపేట గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఐదు కిలలో పశుగ్రాస జొన్నరకం విత్తన పేకెట్ ధర రూ. 460 కాగా రైతుకు 115 రూపాయలకు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. సబ్సిడీగా 345 రూపాయలను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. మేలైన పశుగ్రాసం ద్వారా అధికపాల దిగుబడి పొందవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుడు పశువైద్యుడు లఖినేని కిరణ్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంటు కె.ముకుందరావు, ఎస్.శాంతారావు, కె.ధర్మారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

• సీఐటీయూ డిమాండ్


నిరసనలో సీఐటీయూ ప్రతినిధులు, కార్మికులు

టెక్కలి: ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, అమ్మకాలను తక్షణమే ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. టెక్కలిలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్మికులతో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, థర్డ్ పార్టీ ఉద్యోగులకు కనీస వేతం 26 వేల రూపాయలు అందజేయాలని, భవన నిర్మాణ, గ్రానైట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అంగన్‌వాడీల సమస్యలపై పీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎన్.షణ్ముఖరావు, ప్రతినిధులు బి.వాసుదేవరావు, ధర్మారావు, రమణమ్మ, నిర్మళ, ఇందు, లక్ష్మి, శ్యామల, సత్య, దేవి, పూర్ణ, తవుడు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి


ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో నీరజ

కంచిలి: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి విధులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో వి.నీరజ అన్నారు. మండలంలోని డి.జి.పురం సచివాలయాన్ని బుధవారం సందర్శించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి కె.వంశీకృష్ణ, ఉన్నారు.

వైస్ ఎంపీపీకి జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ


రమణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పిరియా విజయ తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: మండల ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వు వివేకానందరెడ్డి మాతృమూర్తి రమణమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం ఈదుపురం గ్రామంలోని వివేకానందరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. రమణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, సర్పంచ్ నర్తు వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడలు నర్తు భాను, రాంపత్ని చిట్టిబాబు ఉన్నారు.

12న కొత్తమ్మతల్లి పూజా సామగ్రి విక్రయానికి వేలం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో వివిధ పూజా సామగ్రి విక్రయానికి సంబంధించి ఈ నెల 12వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో వాచకచర్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.అమ్మవారి ఫొటోలు, రక్షలు, తాళ్ల విక్రయించుకోవడానికి, అలాగే అమ్మవారికి భక్తులు సమర్పిస్తున్న చీరలు, కొబ్బరి ముక్కలను పొందుటకు రెండేళ్ల కాలానికి వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల ఉన్న ముందుగా పేర్లను ఆలయంలో నమోదు చేసుకోవాలని ఈవో సూచించారు.

కేజీబీవీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


పిచ్చిమొక్కలను తొలగిస్తున్న దృశ్యం


విద్యాలయం లోపల క్లోరినేషన్ చేసున్న సిబ్బంది

కోటబొమ్మాళి: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను బుధవారం చేపట్టారు. మంచినీటి ట్యాంకులు, పైపులైన్లను శుభ్రపరిచారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. కేజీబీవీలో ఇటీవల 22 మంది విద్యార్థినులు డయేరియా బారిన పడిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పారిశుద్ధ్య పనులు చేదుతున్నట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రశాంతి తెలిపారు. ప్రస్తుతం డయారియా అదుపులోకి వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి


కాశీబుగ్గ: ఎంపీడీవో కార్యాలయ రోడ్డులో స్కీం వర్కర్ల ప్రదర్శన


వజ్రపుకొత్తూరు: ర్యాలీగా వెళ్తున్న స్కీం వర్కర్లు

కాశీబుగ్గ: స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు కోరారు. అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా పలాస సీఐటీయూ ఆధ్వర్యంలో కాశీబుగ్గ పాతబస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు స్కీం వర్కర్లతో కలిసి బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి మాట్లాడుతూ.. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రూ. 26 వేల కనీస వేతనాలు అమలు చేయాలని, స్కీమ్ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యూటీ, పింఛన్ అమలుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆటో మోటార్, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ చట్టం అమలు చేయాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బి.సునీత, పి.పద్మ, సరస్వతి, ఆర్.అప్పలనరసమ్మ, ఆశా యూనియన్ నాయకులు లావణ్య పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ. 20 వేలు అమలు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎన్.మోహనరావు కోరారు. మండల కేంద్రం వజ్రపుకొత్తూరులో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. శ్రామిక మహిళా నేత బి.సుగుణవతి, రైతు సంఘం నాయకుడు భాస్కరరావు, అంగన్‌వాడీ సంఘ నాయకులు చామంతి, గీత, విజయలక్ష్మి, ఎస్.ధనలక్ష్మి, నిర్మల, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు తదితరులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని సీబీఎస్ఈ పాఠశాల డైరీని బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధన చేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. హైబ్రిడ్ లెర్నింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ విధానలను కొనియాడారు. పాఠశాల కార్యదర్శి జోహార్‌ఖాన్, పట్టణ ఎస్ఐ వి.సత్యన్నారాయణ, పాఠశాల ట్రస్టీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ పండా, హెచ్ఎం రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెడుతున్న వ్యక్తిపై ఫిర్యాదు


ఎస్ఐ పారినాయుడుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: తమ సామాజికవర్గంపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన పైల రాజగోపాల్‌దాస్‌పై చర్యలు తీసుకోవాలని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడుకు బుధవారం ఫిర్యాదు చేసి..వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలాస బ్రాహ్మణ సంఘ నాయకుడు అనిల్‌శర్మ మాట్లాడుతూ.. రాజగోపాల్‌దాస్ సోషల్ మీడియా వేదికగా బ్రాహ్మణ కులాన్ని కించపరచారన్నారు. అతనిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజనోద్యమ నిర్మాతలకు ఘనంగా నివాళి

పలాస: శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట నిర్మాతలు వెంపటాపు సత్యం, ఆదిబట్ల కైలాసంలకు బుధవారం ఘనంగా నివాళ్లు అర్పించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో కొతారింగ్ తాళబద్ర, బొడ్డపాడు గ్రామాల్లో ఆయా విప్లవ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ఇద్దరు ఉపాధ్యాయులైన వెంపటాపు, ఆదిబట్ల కైలాసాల 54వ వర్ధంతి సభను బుధవారం నిర్వహించారు. పార్టీ నాయకులు వంకల మాధవరావు, గొరకల బాలక్రిష్ణ, కుసుమ పాల్గొన్నారు.

రోడ్లతోనే ప్రగతి

కవిటి: రహదారులే అభివృద్ధికి దోహదపడతాయని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బి.అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలోని తన కార్యాలయంలో సోంపేట సబ్‌డివిజినల్‌స్థాయి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో శాఖాపరమైన సమీక్షను బుధవారం నిర్వహించి మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ రామినాయుడు, జేఈఈ పాల్గొన్నారు.

మందస కాలేజీ సమస్యలు పరిష్కరించాలి

కాశీబుగ్గ: మందస ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పూర్వ విద్యార్థులు కోరారు. ఈ మేరకు ఆర్‌జేడీ ఐ.శారదకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కళాశాల తనిఖీ నిమిత్తం విచ్చేసిన ఆమెను పూర్వ విద్యార్థులు కలిసి కాలేజీలో మౌలిక వసతులు కల్పించాలని, ఇంగ్లిష్ మీడియం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పూర్వ విద్యార్థులు వడ్డి గోపాలకృష్ణ, శ్రీనివాస్ పాడి, ఆర్.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే 'అమ్మకు వందనం' ఇవ్వాలి


సమావేశంలో పాల్గొన్న సంఘ ప్రతినిధులు

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకే అమ్మకు వందనం పథకం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. టెక్కలిలో జిల్లా స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలల్లో యధాతథంగా ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహించాలని, పాఠశాల మౌలిక వసతుల బాధ్యతల నుంచి ప్రధానోపాధ్యాయులను తప్పించాలని, పాఠశాల విద్యుత్ చార్జీలు ప్రభుత్వమే నేరుగా చెల్లించాలని, జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షుడు ఎన్.లక్ష్మణరావు, కోశాధికారి చిలుకు కృష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.హరిబాబుతో పాటు సీతారామరాజు, కె.హేమలత, సీహెచ్ రమాదేవి, డి.గోవిందరావు, టి.వెంకటరమణ, ఆర్.మధుబాబు, సీహెచ్.విశ్వనాథం పాల్గొన్నారు.

వృద్ధురాలికి గృహాన్ని నిర్మించిన దాత

సంతబొమ్మాళి: నౌపడ గ్రామంలో నిరుపేద వృద్ధురాలు గుజ్జు బూలమ్మకు చెన్నూరు నారీమణి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మేస్త్రి రెయ్యి గోవింద సహాయంతో సుమారు రూ. 60 వేలు ఖర్చుతో నౌపడలోని ఓరిమడి దగ్గర గృహాన్ని నిర్మించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మహిళలు, యువకుల ఆధ్వర్యంలో గృహప్రవేశం జరిపించారు. అంతేకాకుండా భూలమ్మకు నెల రోజులకు సరిపడా కిరాణా సరుకులను, వస్త్రాలను అందజేశారు. స్థానిక యువకులు శివ, సంతోష్, బాలరాజు, రాజబాబు, వాసు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు ఎంపీపీ పరామర్శ


జానకమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవదాస్‌రెడ్డి తదితరులు

కంచిలి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారిని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. గొల్ల కంచిలి గ్రామానికి చెందిన పిన్నింటి మహాలక్ష్మి, పురుషోత్తపురం సచివాలయం పరిధి ఎస్.ఆర్.సి.పురం గ్రామానికి చెందిన కొల్లి జానకమ్మ ఇటీవల మృతిచెందారు. వీరి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వజ్జ మృత్యుంజయం, జేసీఎస్ కన్వీనర్ కొనపల సురేష్, ఏఎంసీ చైర్మన్ లడ్డు కేశవపాత్రో, సర్పంచ్‌లు డొక్కరి బలరాం, సింహాచలం ఉన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కంచిలి: విద్యుత్ సమస్యను పరిష్కరించాలని స్థానిక అబ్దుల్ కలాం కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బి.అశోక్‌ను తన కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు 145 ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ కాలనీకి విద్యుత్ సౌకర్యం లేదని ఎమ్మెల్యేకు వివరించారు. నాయకులు మాదిన ప్రదీప్, అబ్దుల్ కలాం కాలనీ వాసులు ఉన్నారు.